# ఇది ప్రశ్న! ఏది జవాబు?

మద్దాలి నిర్మల

గది నిండా పరిచిన సామాన్ల మధ్యలో నిలబడి ఏది ఎక్కడ ఎలా సర్దాలా అని చూస్తున్నాను

"సామాను ఇంకా సర్దలేదేమిటి?"

వెనక్కి తిరిగి చూశాను గుమ్మంలో నిలబడిన ఓ లావుపాటి ఆకారం కన్పించింది

"ఆ! మరేనండీ. ఇప్పుడేగా దిగాము" సమాధానంగా అన్నాను.

"అన్నట్టు మీ పేరేవిఁటన్నారూ" కుతూహలంగా అడిగింది ఆవిడ.

నేనేమీ అనలేదు అందామనుకుని మర్యాదగా వుండదని "ఇందిర అండీ" అన్నాను, ఆవిడని లోపలికి రమ్మని అందామంటే నిలబడేందుకు కూడ చోటులేని ఆ గదిని కలయచూస్తూ

"ఉహూ! నన్ను జానకమ్మ అంటారు లెండి మీ పక్క వాటాయే మాది. అయితే మీ ఇద్దరే నన్నమాట ఈ ఇంట్లో వుండేది. మరి పిల్లా జెల్లా" అంటూ అర్ధోక్తిలో ఆపేసిందావిడ

"అవునండీ. మా అమ్మాయి పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోయింది. మా అబ్బాయి గుంటూరులో మెడిసిన్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు మాకిద్దరే పిల్లలు" అన్నాను ఈ కాసేపట్లోనే నా దగ్గర సమాచారం రాబట్టిన ఆవిడ చొరవకి ఆశ్చర్యపోతూ

"పోనీలెండి. అదృష్టవంతులు. అందరికీ ఆ అదృష్టం వుండద్దూ. వూరికే కనడంగానే సరా! వాళ్ళని పెంచటంలోనే వున్నది అసలు సంగతి. అయ్యో మీ పనికి అడ్డొచ్చాను. వస్తాను" అంటూ వెళ్ళిపోయిందావిడ. ఎందుకో ఆవిడని చూస్తే అసాధ్యురా-లన్పించింది. అయినా నా జాగ్రత్తలో నేనుంటే నాకేమిటి అనుకున్నాను.

అద్దె కొంపల అవస్థలతో సతమతమైన నాకు యీ యిల్లు దొరకటం ఒక వరంలా అన్పించింది. అనుకోకుండా మా వారి స్నేహితుడికి బదిలీ అయిపోవటంతో ఆయన వున్న ఇల్లు మా కిప్పించి వెళ్ళారు. లేకపోతే విజయవాడలో అన్ని నౌకర్యాలు వున్న ఇల్లు ఇంత తక్కువ అద్దెలో దొరకటం నిజంగా అదృష్టమే. ఇంటి యజమాని ఇక్కడ ఉండరు కేవలం అద్దె వసూలుకి మాత్రం వచ్చి వెళ్ళిపోతూ వుంటారు అసలు వున్నవే మూడు వాటాలు మా పక్కన జానకమ్మగారు, వాళ్ళపక్కన ఇంకో వాటా! ఎవరికీ ఒకరితో ఒకరు మాట్లాడే అవసరం లేదు ఇంటి యజమాని పుణ్యాత్ముడు కాబట్టి ఇలా ప్రత్యేక నౌకర్యాలు కలిగించారు. అద్దె పోసినా సుఖం లేకపోతే ఎలా చెప్పండి?

*　　*　　*

అప్పుడే స్కూలు నుండి వచ్చిన నాకు గేటులోనే ఎదురైంది జానకమ్మగారు



"ఏమండీ ఏమిటా పుస్తకం? ఇప్పుడే ఇస్తా నివ్వండి"

నా చేతిలో ఉన్న కొత్త మాస పత్రికని ఆవిడ కిచ్చాను.

"ఇదిగో! ఇది విన్నారా ఇందిరమ్మా" అంటూ నే నిచ్చిన మాస పత్రిక తిరిగి ఇచ్చే నెపంతో సరాసరి వంటింట్లోకి వచ్చేసిందావిడ.

ఏమిటి అని నేనడగకుండానే మళ్ళీ ఆవిడే మొదలు పెట్టింది. "ఆ పద్మ లేదూ! అన్నట్టు మరిచిపోయాను పద్మంటే నీకు తెలియదు కదూ! ఆ చివరి వాటా లేదూ! వాళ్ళ రెండో అమ్మాయి. అది ఓ బ్యాంక్‌లో ఉద్యోగం వెలగబెడుతోందిలే. అది తండ్రిని గడప తొక్కద్దందిట. అన్యాయంగా లేదూ! ఎటువంటి వాడైనా మగవాడు మగవాడే కదా! అలా మాట్లాడొచ్చా? పిదప కాలం పిదప బుద్ధులూనూ

నువ్వసలు దాన్ని చూడనేలేదు కదూ! చూపిస్తాలే. ఎంత పొగరనుకున్నావు మనం ఎదురుగా వున్నా కూడ పలకరించను కూడా పలకరించదు అదెన్నాళ్ళో నేను చూస్తాలే అయినా ఎవరెట్లాపోతే మనకెందుకులే. ఇదిగో నీ పుస్తకం తీసుకో. మరి నే వెడుతున్నా!"

ఇంతకీ ఆ పద్మంటే ఈవిడ కెందుకో అంత అక్కసు నా కర్థం కాలేదు వాళ్ళు ఏమైతే ఈవిడ కెందుకో అది నా కెందుకు చెప్పాలో అంతకంటె అర్థం కాలేదు ఆలోచిస్తున్న నేను శ్రీవారి పిలుపుతో యీ లోకంలోకి వచ్చాను.

"ఇందూ! ఏమిటి ఆలోచిస్తున్నావు"

"అబ్బే ఏం లేదు పక్కింటావిడ ఏదో ప్రాంతీయ వార్తలు చెప్పి వెళ్ళింది అదే ఆలోచిస్తున్నాను"

"సరి. సరి ప్రాంతీయ వార్తల్లో పడి నాకేమైనా కాఫీ ఇచ్చేదుందా!"

గబగబా ఆ ప్రయత్నంలో పడ్డాను

ఇంతలో నే "ఇందిరమ్మా! ఇంట్లో వున్నావా! త్వరగా రా." నేను బయటికి రాకముందే తనే లోపలి కొచ్చేసి "చూడు.... చూడు. ఆ పద్మ వస్తోంది. ఎంత పొగరో చూడు. అన్నీ నంగనాచి బుద్ధులే. ఆ పవిట కప్పుకోవడం చూడు. అదో వేషం" నేను వింటున్నదీ లేనిదీ కూడ గమనించకుండా తన ధోరణిలో తను చెప్పేస్తోందావిడ. ఎందుకో నాకు కూడ ఆ




అమ్మాయిని చూడాలన్పించింది పరీక్షగా చూశాను మమ్మల్ని గమనించనట్లే తలవంచుకొని తమ వాటాలోకి వెళ్ళిపోయిందావిడ కూడా

నా కెందుకో ఆమెను చూస్తే ఆశ్చర్యం వేసింది పైకి ఇంత నెమ్మదిగా కనిపించే ఆ అమ్మాయి తండ్రి నెదిరించ గలిగిందా అని ఏమో ఎవరు చెప్పగలరు ఎవరి మనసు ఎలాటిదో నేను కూడ లోపలికి వెళ్ళిపోయాను

ఆ తర్వాత అప్పుడప్పుడూ కన్పించేది ఆ అమ్మాయి. వాళ్ళు ఎనిమిది మంది ఆడపిల్లలుట ఆ తండ్రి ఏదో వ్యాపారం చేస్తాడట ఎంత సంపా-దించినా ఎనిమిది మంది పిల్లలంటే ఎలా సరి-పోతుంది అందులోనూ ఆయన వీళ్ళని గురించి పట్టించుకోడట. ఏదో వేళకి వచ్చి భోజనం చేసి వెళ్ళిపోతాడట అసలు అందుకే ఆ పిల్లలు అలా బరితెగించి పోయారట ఒక్క దానికీ తండ్రంటే లక్ష్యం లేదట ఆ తల్లి ఓ రోగిష్టి ఎప్పుడూ

# ఇది ప్రశ్న! ఏది జవాబు?

మంచంలోనే వుంటుందిట పెద్ద పిల్లకి ఇంకా పెళ్ళి కాలేదు వంట పనంతా ఆ అమ్మాయే చేస్తుందిట "రాకాసి మూకకి పెళ్ళిళ్ళలా అవుతాయి" ఇది జానకమ్మగారి వ్యాఖ్యానంతో కూడిన కథనం నిజమే సరియైన పెంపకం లేకపోతే పిల్ల లలాగే వుంటారు. నాకూ అన్పించింది

రోజు కొకసారైనా కనీసం వాళ్ళ ఇంట్లో జరిగే గొడవ అంతా నాకు చెపితే గాని జానకమ్మగారికి తృప్తి కలిగేది కాదు నేను వినకపోయినా, ఏదో పని కల్పించుకుని అవతలికి వెళ్ళినా, నా వెనకాలే తిరుగుతూ తను చెప్పదలచుకున్నది చెప్పి గాని వెళ్ళేది కాదు. ఇలా కాదని ఇంట్లో వున్నంతసేపూ తలుపు వేసేసుకుని లోపలే వుంటున్నాను అయినా ఆవిడ దాడి తప్పటం లేదు

ఆదివారం కాస్త తీరుబడిగా వుంటే ఏదో కుట్టు-కుంటున్నాను

అడుగుల చప్పుడుకి తలెత్తాను ఆ అమ్మాయి పద్మ నిలబడి వున్నది. నన్ను చూసి ఏదో చెప్పబోయి ఆగింది ఆమె ముఖంలో భయం ముఖమంతా చెమట పట్టి వుంది కంగారు పడుతున్నట్టుగా ఉంది

"ఏమండీ మా అమ్మ పడిపోయింది. ఒకసారి వచ్చి చూడండి నాకేదో భయంగా వుంది"

"ఏమైంది మీ నాన్నగారు లేరా?" అంటూ ఆమె వెనకాలే వెళ్ళాను

ఆవిడ స్పృహ లేకుండా పడి వుంది. పిల్లలంతా బిక్క ముఖాలతో ఆవిడ చుట్టూ నిలబడి వున్నారు.

"ఫర్వాలేదు. కంగారు పడకండి" ధైర్యం చెప్పి డాక్టరు కోసం పరుగెత్తాను. పక్క వీధిలో వున్న డాక్టరు శాంత మాకు దూరపు బంధువు. పైగా స్నేహితురాలు.

డాక్టరు పరీక్ష చేసి వెళ్ళింది. పద్మ తల్లికి బలహీనమని, సరియైన ఆహారం లేక, విశ్రాంతి లేకపోవటమే కారణమని చెప్పింది ఆవిడకి బ్లడ్ ప్రషర్ కూడ ఉందని. ఎక్కువగా ఆవేశపడినా, ఆలోచించినా అలా పడిపోతుందని చెప్పి, విశ్రాంతి, ముఖ్యంగా మానసిక విశ్రాంతి అవసరమని మరీ మరీ చెప్పి వెళ్ళింది. ఆ తర్వాత ఎప్పుడైనా వెళ్ళి ఆవిడని చూసి వస్తున్నాను ఆ పిల్లలు కూడ ఆంటీ అంటూ నాకు దగ్గరయ్యారు

మళ్ళీ పరీక్షల హడావిడిలో వాళ్ళింటికి వెళ్ళటానికి తీరుబడి కావటంలేదు ఈమధ్య ఎందుకో జానకమ్మగారి దాడి కూడ తగ్గింది. ప్రాణం హాయిగా వున్నది

* * *

"ఆంటీ ! మీరు కథలు రాస్తారా?" రచయిత్రి ఇందిర మీరేనన్నమాట. ఇన్నాళ్ళు నాకు తెలియ-లేదండీ" ఎంతో ఉత్సాహంగా నా ఫోటో వివరాలున్న దీపావళి ప్రత్యేక సంచిక తీసుకుని గబగబా లోపలికి వచ్చింది పద్మ వాళ్ళక్క సునీత.

"అవును. ఇప్పుడేమైంది"

"ఏం లేదు ఇన్నాళ్ళు మాకు చెప్పలేదేమండీ. మీ రచనలు నేను ఎంతో ఆసక్తితో చదువుతాను." గబగబ మాట్లాడేస్తోందామ్మాయి

సాయంతం పద్మ నా దగ్గర కొచ్చింది

"ఆంటీ! మీరు కథలు రాస్తారా? అయితే నా కథ వ్రాయండి నిజంగా ఆంటీ సీరియస్‌గా చెపుతున్నాను కనీసం నా కథ చదివితేనన్నా కొందరిలోనైనా మార్పు వస్తుందేమో!

ఆంటీ! నా గురించి మీరేమనుకుంటున్నారు ఒట్టి పొగరుబోతు అనుకుటున్నారు కదూ! మీరే కాదు ఈ వీధిలో అందరికీ అదే అభిప్రాయం. అలా అను-కోవటం వాళ్ళ తప్పు కాదు లెండి. అసలింతకీ తప్పెవరిదో మీరు చెప్పాలి నా కథ వ్రాస్తారుకదూ!

మేము ఎనిమిది మంది సంతానం మా నాన్నకి అది మీకు తెలుసుగదా! ఇక మా నాన్న. ఆయన ఏదో చిన్న వ్యాపారం చేస్తున్నారు ఆదివరకు కాస్త బాగానే వుండేది. ఈమధ్యలో అది కూడ నష్టంతోనే నడుస్తోంది రెండేళ్ళనుండీ దీనికితోడు, మా యింట్లో పరిస్థితి. మా అక్క పెళ్ళీకెదిగి వున్నది. దాని కాళ్ళమీద అది నిలబడటానికి పెద్ద చదువు లేదు ఉద్యోగం చెయ్యలేదు. మా నాన్న సంపాదనలో ఎనిమిది మంది పిల్లలని పోషించాలి. ఎలా! కాన్పులతో బలహీనమైన అమ్మలో అసలు శక్తి లేదు తన పని తాను చేసికోలేని స్థితిలో ఆవిడ ఇంటికి వచ్చేసరికి ఈసురోమని పిల్లలు. ఈ వాతావరణం చూసి మా నాన్న దురలవాట్లకి బానిసై పోయారు అదే కాకుండా మా నాన్నకి ఇంకో భార్య కూడ వున్నది. ఆశ్చర్యపోతున్నారు కదూ! మా అమ్మతో తృప్తి పడలేని నాన్న తన సుఖాన్ని ఇంకొక స్త్రీతో వెతుక్కున్నారు ఆవిడకి ఇద్దరు పిల్లలు మరి రెండు సంసారాలు గడపాలంటే కష్టం గదా! కనీసం నేను ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి కొంత నయం మీకు తెలియదు. మా నాన్న సరిగా ఇంటికి వచ్చి ఆరు నెలలైంది వారాని కొకసారి వచ్చి అలా చూసి వెళ్ళి-పోతుంటారు ఈమధ్య అది కూడ కరువైంది. రెండు సంసారాలు గడపటం కష్టమైన తరువాత నాన్న ఆవిడని కూడ ఇక్కడికి తీసుకు వచ్చేస్తానన్నారు ఇంతమంది పిల్లలకీ ఆవిడ ఎవరని చెపుతారు. చుట్టు పక్కల వాళ్ళందరికీ అదొక కాలక్షేపం ఇప్పటికే ఇంతందంగా సుఖంగా వున్న సంసారం ఇక నడి వీధిలోనే వుంటుంది అందుకే వీలు కాదని పట్టు పట్టాను."

"ఆవిడ ఏదో చిన్న ఉద్యోగం చేస్తోంది కాబట్టి అక్కడే వుండనివ్వండి" అన్నాను అదే నేను చేసిన తప్పు.

కూతురు పెళ్ళి చెయ్యవలసిన వయసులో ఇంకొక భార్యను యింటికి తెచ్చుకునే నాన్న నేమనాలి అందుకే ఉన్నదానితోనే అక్క పెళ్ళి చేసెయ్య-మన్నాను. ఆ తర్వాత మన తంటాలు మనం పడదాం. ఇకెక్కడికైనా ఇల్లు ఖాళీ చేసి వెడదామంటే ఇంత తక్కువ అద్దెలో ఇంత మంచి యిల్లు దొరకదు. కాబట్టి ఆవిడని అక్కడే వుండనివ్వండి" అన్నాను అప్పటినుండి మా నాన్న పూర్తిగా ఇంటికి రావటమే మానేశారు అదీ నేను మా నాన్న పట్ల చేసిన నేరం. ఈ వీధిలో వాళ్ళందరూ తండ్రిని గెంటేసిన కూతురు అని బిరుదిచ్చేశారు.

ఈ పిల్లలందర్నీ పైకి తీసుకు రాగలనా! ఆంటీ! అప్పుడప్పుడు భయం వేస్తుంది కనీసం జయకి కూడ ఉద్యోగం వస్తే కొంత నయం. అరే ఆంటీ! నా కథ చెప్పి మిమ్మల్ని బాధ పెట్టానా! మీరు చెప్పండ

